

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 5 సంచిక : 4 పుష్పం : 14-17 ఎడిటర్ : పి.హెచ్.వి. సత్యవతి (హైమ)

### సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-99, ప్రాతళ్ళ మెరక

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

బంధం ఎక్కడో ఉంది, మోక్షం ఎక్కడో ఉంది అని అనుకోవద్దు. రెండూ ఇక్కడే ఉన్నాయి. అహంభావన తొలగించుకొంటే మోక్షం, అహంభావన తొలగించుకోలేకపోతే బంధం. అహంభావన ఎక్కడ ఉందో అక్కడ దుఃఖం ఉంటుంది. అహంభావన నశిస్తే మోక్షసుఖం నిన్ను వరిస్తుంది. మనస్సు అనేది ఒకటి ఉంది. అది బయటకువచ్చిందా అహంభావన అవుతుంది. దానికి లోపలకు చూడటం నేర్పితే, దానికి అంతర్‌దృష్టి కలిగితే అదేవెళ్ళి చైతన్యాకారం చెందుతుంది. మనస్సును బయటకు పంపుతావా లేక దానికి అంతర్‌దృష్టి కలుగజేసి దాని మూలాన్ని అన్వేషించి సత్యస్వరూపాన్ని పొందుతావా అనేది నీ చేతులలో ఉంది. దేహం మరణించినా నీవు మరణించవు. ఆ మరణించకుండా ఉన్నదేదో దానిని ప్రత్యక్షంగా దర్శించటమే రియలైజేషన్. ఇప్పుడు నీవు నీ మనస్సుతోటి, దేహం తోటి, వికారముల తోటి ఎలా తాదాప్యం పొందుతున్నావో అలాగ మరణం లేని వస్తువుతో తాదాప్యం పొందితే అది నీకు తానుగా వ్యక్తమవుతుంది. అప్పుడు నీకు అమృతస్థితి కలుగుతుంది. అప్పుడు దేహం మరణించినా నాకు మరణం లేదు అన్న సంగతి నీకు తెలుస్తుంది. అన్ని కాలములలో, అన్ని అవస్థలలో ఏ వస్తువు అయితే ఉందో దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే జ్ఞానం. అది పొందటానికి నీ దేహాన్ని మనస్సును ఉపయోగించుకో. నీవు సాధించవలసింది అదే. అది తప్ప ఏది సాధించినా ఒకటి లేని సున్నలతో సమానము.

ఇప్పుడు సహస్రారంలో నీ మనస్సు ఎంత సహజంగా ఉందో అంత సహజంగా నీ హృదయంలో మనస్సును ఉంచగలిగితే మనస్సు నశిస్తుంది. మనస్సు నశించిన వెంటనే నిజం నీకు వ్యక్తమవుతుంది. అప్పుడు నీవు చావులేనిస్థితిని పొందుతావు. నేను మరణిస్తున్నాను అనుకొనే వాడు తప్పక జన్మిస్తాడు. నేను జన్మించాను అనుకొనే వాడు

తప్పక మరణిస్తాడు. ఎవడికి మోక్షం వస్తుంది అంటే నేను అసలు పుట్టలేదు అన్న సంగతి ఎవడికి తెలుస్తుందో వాడికి మోక్షం వస్తుంది అని భగవాన్ చెప్పారు. నీవు దేహంతో తాదాప్యం పొందుతున్నావు కాబట్టి నేను పుట్టాను, నేను మరణిస్తున్నాను అని నీవు అనుకొంటున్నావు. ఆత్మకు పుట్టుక లేదు, పుట్టుక లేని దానికి చావు లేదు. నీవు ఆత్మవై ఉన్నావు. నీకు ఆత్మానుభవం కలిగినప్పుడు నేను అసలు పుట్టలేదు అన్న సంగతి నీకు అనుభవంలోనికి వస్తుంది. ఈశ్వరానుగ్రహం మాకు ఎలా వస్తుంది అని ప్రశ్న. ఇప్పుడు మనం పనిచేస్తున్నాము. మన ఇంద్రియాలను తృప్తి పరచటానికి, అహంభావనను పెంచుకోవటానికి పనిచేస్తున్నాము. ఇదే పని గీతలో భగవంతుడు ఎలా చేయమని చెప్పాడో అలాగ చేస్తే, భగవంతుడు చెప్పిన విధంగా జీవిస్తే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. మనం ఈశ్వరానుగ్రహానికి పాత్రులమయితే చేతిలో డబ్బు ఉంటే బజారులో ఉన్న వస్తువును కొనుక్కోవటం ఎంత తేలికో ఈశ్వరానుగ్రహానికి పాత్రులయితే ఆత్మజ్ఞానం పొందటం కూడా అంతేతేలిక.

అత్యంత సులభం ఆత్మవిద్య అని భగవాన్ చెప్పారు. పూజ చేయాలంటే ఎంతో సామాగ్రి ఉండాలి. పుష్పాలు ఉండాలి, ఫలాలు ఉండాలి, అక్కడ శుభ్రం చేయాలి దేవుని పఠం పెట్టాలి ఇలా ఎంతో పని ఉంది. పూజ కంటే తేలిక ఆత్మ విద్య. ఏ నేను అయితే దేహంతో తాదాప్యం పొందుతోందో ఆ నేనుకు వెళ్లే ఆహారాన్ని కట్ చెయ్యాలి. నీవు చేసేపని నిర్మలంగా, సహజంగా చెయ్యి మిధ్యానేనుకు వెళ్లే Food Supply ను కట్‌చేస్తే అది నశిస్తుంది. అది నశించిన మరుక్షణంలో నిజమైననేను నీకు తానుగా వ్యక్తమవుతుంది. సాధన పేరు మీద మన అహంభావనను అలంకరించుకోకూడదు. అరిషడ్ వర్గాల గురించి గంటల తరబడి ఉపన్యాసములు చెప్పినవారు ఉన్నారు. వీటి గురించి భగవాన్‌ను అడిగితే వాటి గురించి ఆలోచించమని అసలు నీకు ఎవరు చెప్పారు. వాటికి నిజంగా బలంలేదు, నీ ఆలోచన వలననే వాటికి బలం వస్తోంది. ఏదైతే నీవు అవునో దాని గురించి ఆలోచించు అది నీవు అవుతావు. నీవు కాని దాని గురించి ఎంత ఆలోచించినా, యుగాల తరబడి ఆలోచించినా అది అవ్వనే అవ్వవు. నీ అలవాట్ల యొక్క వేగం వలన అలా నీవు ఆలోచిస్తున్నావు అది కట్ చెయ్యి. మీరు ఏదైతే అవునో దాని గురించి ఆలోచించండి., దాని గురించి శ్రవణం చెయ్యండి, మననం చెయ్యండి, దానిని ధ్యానం చెయ్యండి. అది మీరు అవుతారు. నెగిటివ్ ఆలోచన వద్దు, పాజిటివ్‌గా ఆలోచించండి. భగవంతుని ప్రార్థించగా, ప్రార్థించగా భగవంతునికోసం జీవిస్తూ ఉంటే ఎటువంటి బుద్ధిని ఇస్తే మనకు భగవదనుభవం కలుగుతుందో అటువంటి బుద్ధిని మనకు ప్రసాదిస్తాడు. అదే అనుగ్రహం.

ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధమునననుసరించి ఆడిస్తున్నాడు. జరుగవలసినది జరిగే తీరును. జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు. ఇది నిశ్చయము. ఇది భగవాన్ తల్లికి చెప్పిన మొదటి ఉపదేశం. ఇది ఆయన అనుభవంలో ఉండి చెప్పాడు కాబట్టి ఆయనకు దుఃఖం నశించింది. ఈ వాక్యము మనమూ చెపుతున్నప్పటికి మనకు అనుభవంలో లేదు కాబట్టి మనకు దుఃఖం నశించలేదు. ఎవరు చెపుతూ ఉంటే మనం శ్రవణం చేయాలంటే ఒక మాట వలన, ఒక చూపు వలన, ఒక తలంపు వలన మన స్వరూపానికి మనకు ఉన్న దూరం తగ్గిపోవాలి అట్టివారు చెప్పే మాటలు మనం శ్రవణం చేయాలి మనం పనిచేసేటప్పుడు లోపల ప్రేమ, ఆప్యాయత ఉండాలి. అది సత్వగుణం ఉంటేనే సాధ్యం. మన స్వరూపం నుండి మనలను దూరం చేసేది రజోగుణం, మన స్వరూపం దగ్గరకు గెంటుకుని వెళ్ళేది సత్వగుణం.

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 9-12-99, భీమవరం**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

జ్ఞాని మాత్రమే నిజంగా ప్రేమించగలడు, ఎందుచేతనంటే జ్ఞాని యొక్క స్వరూపమే ప్రేమ. భగవంతునిలో ఐక్యం అవ్వటానికి గురువు మనకు సహాయ సహకారములు అందిస్తాడు. గురువు మీన్స్ మాత్రమే, గమ్యం మటుకు ఆత్మసాక్షాత్కారం. దానిని మిస్ అవ్వకూడదు. మన హృదయంలో ఉన్న నిజాన్ని అనుభవంలోనికి తెచ్చుకొంటే గాని మనం ప్రకృతి గుణాలను దాటి వెళ్ళలేము. విద్యతో పాటు దానికి తగిన తపస్సు ఉన్న వ్యక్తి మాట్లాడుతూ ఉంటే దాని ప్రభావము ఈ నాలుగుగోడల మధ్య ఉన్నవారి మీదే కాదు, మానవాళి అంతటి మీదా ఉంటుంది. ఏ విషయాలను చింతిస్తే నీవు పతనమవుతావో ఆ విషయాలను చింతించవద్దు. ఏ విషయాన్ని చింతిస్తే నీవు అభివృద్ధిలోనికి వస్తావో ఆ బ్రహ్మమును నిరంతరము చింతించి పురోభివృద్ధి చెందు. అది అనుభవంలో ఉన్నవారితో సహవాసం చేసి నీవు కూడా ఆ అనుభవం పొందటానికి ప్రయత్నం చెయ్యి. భగవంతునియందు ప్రేమ, భక్తి పెంచుకో. భగవంతుని మీద ప్రేమ, భక్తి పెంచుకొంటే దానికి ప్రతిఫలంగా ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. ఆయన స్వరూపమే జ్ఞానం, ఆయన స్వరూపమే ఆత్మ, మన కోరిక నెరవేరినా, కోరిక నెరవేరకపోయినా మన భక్తి సమానంగా ఉండాలి. అప్పుడు ఈశ్వరుడు మనలను జ్ఞానంతో కప్పుతాడు. నిజం నిర్మలంగా, సహజంగా, సింపుల్‌గా ఉంటుంది, నీవు పనిలో, ఆలోచనలో ఆడంబరం లేకుండా నిర్మలంగా జీవిస్తే ఆడంబరంలేని వస్తువు నీకు హృదయంలోనే వ్యక్తమవుతుంది.

ఇప్పుడు నాకు విషయాలమీద కోరిక ఉంది. ఈశ్వరుడి మీద భక్తి ఉండేలా, ఈశ్వరుని మీద కోరిక ఉండేలా నన్ను అనుగ్రహించండి అని ఒక భక్తుడు భగవాన్‌ను ప్రార్థించాడు. నాకు విషయాలు వద్దు, ఈశ్వరుడే కావాలి అని నీవు అనుకొన్నప్పుడు ఆ తపన నీకు ఉంటే, ఆ జిజ్ఞాస నీకు ఉంటే ఈశ్వర సాక్షాత్కారం తప్పక కలుగుతుంది. నీకు ఏమీ అక్కరలేదు అన్నప్పుడు ఇంక ఉన్నది ఈశ్వరుడే కదా. ఈశ్వర సాక్షాత్కారం అవ్వకుండా ఎలా ఉంటుంది, నీకు భక్తి కావాలంటున్నావు నీ మనస్సు ఈశ్వరభక్తిలో కరిగిపోయేటంత తీవ్రంగా కాంక్షించు. ఈశ్వర ప్రేమలో నీ మనస్సు పూర్తిగా కరిగిపోవాలి. కర్పూరం కాలిపోయిన తరువాత ఏమీ మిగలదు. మనస్సు కూడా కర్పూరం వంటిదే. కర్పూరం ఎలా కాలిపోతుందో అలాగ నీ మనస్సు ఈశ్వర ప్రేమలో పూర్తిగా కాలిపోవాలి. మీరు జీవితం పొడుగునా శ్రద్ధ, సహనం ఈ రెండూ అభ్యాసం చేస్తే మీరు భగవదనుభవం పొందుతారు అని షిరిడీబాబా చెప్పారు.

రమణమహర్షి అవతార ప్రయోజనం ఒక్కటే ఒక్కటి. అది ఏమిటి అంటే మనం భగవంతునికోసం శాస్త్రాలలో వెతుకుచున్నాము. భగవంతుడు నేను నీ హృదయంలో ఉన్నాను అని చెప్పాడు. కాని మనం హృదయంలో వెతకటం మానివేసి మన అన్వేషణ శాస్త్రాలకు పరిమితం చేస్తున్నాము, హృదయంలో అన్వేషించటం లేదు. ఇలా శాస్త్రాలలో వెతుకుచున్న మానవ మానసమును శాస్త్రాలలో నిజం లేదు, నిజం నీ హృదయంలోనే ఉంది అని చెప్పి ఇటు హృదయం వైపుకు మళ్ళించటానికి వచ్చిన అవతారమే రమణావతారం. శాస్త్రాలను చదువుకో. దానివలన పాండిత్యం వస్తుంది. పాండిత్యం మంచిదే. అంతమాత్రం చేత నీకు ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మ నీ హృదయంలో ఉంది. నీ హృదయంలో అన్వేషించు. శాస్త్రం యొక్క సహాయం ఎంత వరకు అవసరమో అంతవరకు శాస్త్రం సహకారం తీసుకో. కాని శాస్త్రమే ప్రధానం అనుకొంటే అది కేవలము లర్జరీ అవుతుంది. సత్యం కోసం శాస్త్రాలలో అన్వేషిస్తూ ఉంటే ఎన్ని యుగాలు వెతికినా శాస్త్రాలలో అది దొరకదు. అది నీ హృదయంలో ఉంది అని శాస్త్రం చెపుతోంది. అందువలన మానవ మానసమును హృదయం వైపుకు మళ్ళించటానికి వచ్చిన అవతారమే రమణావతారం.

ఆత్మజ్ఞానం మాట అటు ఉంచండి ముందు సేవ చేయాలి అని సేవాభావం గురించి చాలా మంది చెపుతున్నారు. పురుషార్థములలో ఉత్తమ పురుషార్థం మోక్షం. నీవు చేస్తున్న సేవ కూడా మోక్షం పొందటానికి సహకరించాలి. సేవ కూడా ఒక మీన్సే గాని సేవ గమ్యం కాదు. గమ్యం ఆత్మజ్ఞాన సముపార్జనే. సేవ చెయ్యి, మంచిదే. సేవేగమ్యం అనుకొంటే

సత్యాన్ని మిస్ అవుతావు. ఏదో మాకు కావలిసినవి తింటున్నాము ఈ సుఖం సరిపోతుంది, సినిమాలు, టీవీలు చూస్తున్నాము. ఈ సంతోషం సరిపోతుంది అని ఇలా కేవలము ప్రాపంచిక భోగములతో సంతృప్తి పడుతూ ఉంటే ఇది కేవలము తమోగుణము లక్షణము. సత్వగుణంలో ఉన్నవాడు ఆత్మసుఖాన్ని కోరుకొంటాడు. సత్వగుణంలో అహంభావన తక్కువ ఉత్పత్తి అవుతుంది. రజోగుణంలో అహంభావన ఎక్కువ ఉత్పత్తి అవుతుంది. సత్వగుణాన్ని అభ్యాసం చేయటం సాధకులందరికి అవసరమే. అన్నింటికంటే ఆత్మ గొప్పది, చైతన్యం గొప్పది. మేటర్ గొప్పది కాదు. అయితే చైతన్యం వ్యక్తం అవ్వటం కోసం మేటర్ కొంత అవసరం. అందుచేత దేవుడు కూడా మేనిఫెస్టు అవుతున్నాడు. ఉన్నది అంతా బ్రహ్మమే అంటున్నారు. అది తప్పించి ఏదీ లేదు అంటున్నారు. ఉన్నది అంతా బహ్మమే అయినప్పుడు నేను ఎక్కడ ఉన్నాను అని ప్రశ్న. నీవు లేనే లేవు కాని ఉన్నాను అని అనుకొంటున్నావు కాబట్టి సాధన చెయ్యి. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఈ సమస్యను వదిలించుకోవాలి, మిధ్యానేను నుండి విడుదల పొందాలి. నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణించు. ఈ మిధ్యానేను నుండి విడుదల పొందాలి అనే విషయం మాత్రం మర్చిపోకు.

మీరు ఇతరులకు ఏదైనా చేసినా అది పూజ అనుకోండి, అది సేవ అని అనుకోవద్దు. ఎవరికైనా ఏదైనా ఇస్తే సేవ చేసాము, దానం చేసాము అనుకొంటాము. మరి మీ శరీరానికి ఏదైనా వస్తే డబ్బు ఖర్చు పెట్టుకొంటున్నారు కదా. అప్పుడు సేవ చేసాము అనుకొంటున్నారా లేదు. ఉపాధులు తేడా అనుకొన్నప్పుడు ఈ గొడవ అంతా వస్తుంది. ఇతరుల ఉపాధిని కూడా నీ ఉపాధితో సమానంగా చూసినప్పుడు ఈ రెండింటికి బేధం లేదు. ఉపాధులు తేడా గాని లోపల ఉన్న వస్తువు ఒక్కటే అన్న తత్వం మనకు తెలిసినప్పుడు ఈ దానాల గొడవ, ధర్మాల గొడవ ఉండదు. రజోగుణంతో ఇతరులకు చేసే సహాయం వలన అహంభావన పెరుగుతుంది, దేహబుద్ధి పెరుగుతుంది. చేసేది సాత్వికంగా చేయటం నేర్చుకోండి. రజోగుణంతో ఏపని చేసినా దానికి ప్రతిఫలం ఆశిస్తాము, కీర్తి గురించి ఆలోచిస్తాము. కీర్తి ఎవరికి కావాలి? మిధ్యా నేనుకు కావాలి. దానిని బట్టి స్వరూపానికి దూరమవుతాము. కేవలము మీ భక్తిని పూజగదికే పరిమితం చేయవద్దు. మన మాట వలన, చేతవలన, ఆలోచనవలన మన స్వరూపానికి మనకు ఉన్న దూరం తగ్గాలి. అలా దూరం తగ్గించే శక్తి సత్వగుణానికి ఉంది. దేహం చనిపోయినప్పుడు నేను చనిపోవటం లేదు అనే అనుభవం ఎవడికైతే కలిగిందో వాడే మహాజ్ఞాని, వాడే మహాగురువు.